క్లుప్తంగా

ఘనంగా పాల కలశాల ఊరేగింపు



పాల కలశాలతో భక్తుల ఊరేగింపు

చిత్తూరు రూరల్: ఆడినెల, పౌర్ణమిని పురస్కరించుకుని చిత్తూరులో మంగళవారం భక్తులు పాల కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. కట్టమంచిలోని వినాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపు ప్రారంభించారు. అనంతరం గుర్రప్పనాయుడు వీధిలోని అంకాళపరమేశ్వరి ఆలయంలో భక్తులు తీసుకొచ్చిన పాల కలశాలతో అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ట్రస్ట్ నిర్వాహకులు కేఎం కుమార్, అర్చకులు కుమార్ పాల్గొన్నారు.

మందిర నిర్మాణానికి విరాళం



విరాళాన్ని ఇస్తున్న పార్థసారథినాయుడు

చిత్తూరు రూరల్: స్థానిక గొడుగుమూరులోని పురాతన శ్రీరామ భజన మందిరం పునఃనిర్మాణ పనులకు మంగళవారం దాత పార్థసారథినాయుడు రూ.25వేలను విరాళంగా అందజేశారు. నగదును భజన మందిర నిర్వాహకులకు అందజేశారు. సందర్భంగా వారు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

గర్భిణుల వివరాలు తెలపాలి

గుడిపాల: గ్రామాల్లో గర్భిణుల వివరాలు ఎప్పటికప్పుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తెలియజేయాలని డాక్టర్ హరి తెలిపారు. గుడిపాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశా వర్కర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేయాలని సూచించారు. అనంతరం ఆశా వర్కర్ల రికార్డులను ఆయన పరిశీలించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ఐరాల: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత సూచించారు. మంగళవారం గుండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్యశిబిరంలో 95 మందికి వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్ పి అరుణ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కనులపండువగా ఆడిపదినెట్టు ఉత్సవాలు



యాదమరి: మండలంలో ఆడిపదినెట్టు ఉత్సవాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆడినెలలో అమ్మవారి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా యాదమరి, పెరుమాళ్లపల్లెలలోని అమ్మవారి ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నడివీధి సత్యమ్మకు మహిళలు అంబలిపోసి, పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు.

పింఛన్ల అందజేత

చిత్తూరు రూరల్: మండలంలో మంగళవారం వేకువజాము నుంచే సామాజిక పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. సాయంత్రానికి 75 శాతం పంపిణీ పూర్తికాగా, ఈనెల 5వ తేదీలోపు పింఛన్లు తీసుకోవచ్చునని ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

127 మందికి వైద్యపరీక్షలు

తవణంపల్లె: చెర్లోపల్లె, కె.పట్నం గ్రామాల్లో 127 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు డాక్టర్ ధాత్రేయచౌదరి, డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం చెర్లోపల్లె, కె.పట్నంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించారు. చెర్లోపల్లెలో డాక్టర్ మోహన్‌వేలు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కె.పట్నంలో డాక్టర్ ధాత్రేయచౌదరి, డాక్టర్ వినయ్‌కుమార్ రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

సన్మానం



అధికారులను సన్మానిస్తున్న డీఎస్పీ శ్రీనివాసమూర్తి

చిత్తూరు అర్బన్: చిత్తూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేసి బదిలీపై వెళుతున్న ఎస్‌ఐ వసంత కుమారి, ఏఎస్‌ఐ సయ్యద్‌ఖాన్‌లను అధికారులు సన్మానించారు. మంగళవారం వీరిద్దరిని నగరంలోని పోలీసు అతిథిగృహంలో డీఎస్పీ శ్రీనివాసమూర్తి సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. బదిలీపై వెళుతున్న అధికారుల సేవలను కొనియాడారు. సీఐ విశ్వనాథరెడ్డి, ఎస్‌ఐలు ప్రసాద్, రమేష్, భారతి పాల్గొన్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పూతలపట్టు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మంగళవారం శేషాపురం, నాగిరెడ్డిపల్లి, నాగిరెడ్డిపల్లి దళిత వాడ, తోట దళిత వాడ, గువ్వలకాలని, కొర్లమిట్ట, పంబలపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే 395 గడపలకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి లబ్ధిదారులకు బుక్‌లెట్‌లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లేవారని, నేడు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యేలే ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్నారని తెలిపారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడులేని విధంగా జగనన్న ప్రభుత్వంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గ్రామస్తులు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, పంచాయతీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, సర్పంచ్ మాసిలామణి, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, ఎంపీటీసీ లావణ్య, సింగల్‌విండో అధ్యక్షుడు దొరస్వామిరెడ్డి, కోఆప్షన్ మెంబర్ ఖాదర్ వల్లి, వైస్ సర్పంచ్ ద్వారకనాథరెడ్డి, ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, ఎస్‌ఐ సురేష్, పంచాయతీ కార్యదర్శి ఖాన్, నేతలు రాజరత్నంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, మణి, బాలాజి, నాగరాజ, ప్రవీణ్ పాల్గొన్నారు.

నేడు గడప గడపకు..

బుధవారం పూతలపట్టు–1వ పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గౌరి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హాజరుకానున్నట్లు తెలిపారు.

వినాయకుని సేవలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

–అద్దాల మండపం పనులు వెంటనే పూర్తిచేయాలి



అద్దాల మండపాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాబు

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మంగళవారం దర్శించుకున్నారు. సాయంత్రం ఆయన స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయం లోపల నిర్మిస్తున్న అద్దాల మండపాన్ని పరిశీలించి పనుల్లో నాణ్యతను పరిశీలించారు. అనంతరం పనులు త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఆలయ ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ రంగస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.

అధిక దిగుబడుల పంటలను సాగుచేయండి



రైతులకు జిప్సమ్ అందజేస్తున్న అధికారులు

గుడిపాల: రైతులు అధిక దిగుబడులు ఇచ్చే పంటలను సాగు చేయాలని వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం గుడిపాలలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. పొలంబడిలో ఆయన వేరుశనగ పంటపై రైతులకు వివరించారు. అనంతరం రైతులకు జిప్సమ్ అందజేశారు. వ్యవసాయాధికారి మాధవి, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు తులసీరాంరెడ్డి, యోగప్రియ, నవీన్, భువనేశ్వరి పాల్గొన్నారు.

గరుడ వాహనంపై వరదరాజుల స్వామి



గరుడవాహనంపై విహరిస్తున్న వరదరాజులస్వామి

కాణిపాకం(యాదమరి): కాణిపాక అనుబంధ వరదరాజులస్వామి ఆలయంలో మంగళవారం సత్యనారాయణవ్రతాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా మంగళవారం ఉదయం ఆలయంలో మూలస్థానంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజులస్వామికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని సత్యనారాయణస్వామి అలంకరణలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించారు. రాత్రి స్వామివారు గరుడ వాహనంలో పురవీధుల్లో విహరించారు.

ఆడికృత్తిక ఉత్సవాలకు ఆహ్వానం



ఆహ్వానపత్రిక అందిస్తున్న ఆలయ చైర్మన్ పట్టాభి

కాణిపాకం(యాదమరి): పాకాల, ఊట్లవారిపల్లెలో వెలసిన సుబ్రమణ్యస్వామి ఆలయ ఆడికృత్తిక ఉత్సవాలకు విచ్చేయాలని కాణిపాక ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశును సుబ్రమణ్యస్వామి ఆలయ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి మంగళవారం ఆహ్వానించారు. ఈనెల 9న ఆడికృత్తిక సందర్భంగా ఆలయంలో నిర్వహించే ఉత్సవాలకు విచ్చేసి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించాలని కోరారు. శాస్త్రోక్తంగా సుబ్రమణ్యస్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తామని వారు తెలియజేశారు. సుబ్రమణ్యస్వామి ఆలయ సిబ్బంది ప్రకాష్, అర్చకులు పాల్గొన్నారు.

ఎనిమిది వారాల్లోపు రిజిస్ట్రేషన్ చేయించాలి

తవణంపల్లె: ఆశా కార్యకర్తలు ఎనిమిది వారాల్లోపు గర్భవతుల పేర్లు రిజిస్ట్రేషన్ చేయించాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ధాత్రేయచౌదరి తెలిపారు. మంగళవారం తవణంపల్లె పీహెచ్‌సీలో ఆశాడే సమావేశం నిర్వహించారు. డీసీఎం మూర్తి, సీహెచ్‌ఓ సుబ్రమణ్యం, పీహెచ్‌ఎన్ భారతి, టీబీ సూపర్‌వైజర్ శివకుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు రాజశేఖర్, అముద, నిర్మల పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటివద్దకే వైద్యం

గుడిపాల: ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో ప్రజల ఇంటి వద్దకే వైద్యం వస్తోందని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సందీప్ అన్నారు. మంగళవారం గుడిపాలలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 63 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య సిబ్బంది చంద్ర, సోనియా, సింధూజ పాల్గొన్నారు.

వైభవంగా పౌర్ణమి వేడుకలు



ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



గుడిపాలలో..

తవణంపల్లె: అర్గగిరి వీరాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయంలో 11 గంటలకు ఉభయదారులచే భక్తిప్రపత్తులతో అర్చకులు సుదర్శన హోమం నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తికి అభిషేకం, పూజలు చేశారు. పల్లకిలో వీరాంజనేయ స్వామిని కొలువుదీర్చి ప్రాకారం చుట్టూ ప్రదక్షిణ చేశారు. భక్తులు స్వామికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వేడుకలను ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఈఓ వెంకటసుబ్బారెడ్డి పర్యవేక్షించారు.

గుడిపాల: 197రామాపురం గ్రామం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో మంగళవారం పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కోదండరామ ఆలయంలో..

చిత్తూరు రూరల్: స్థానిక రాములు గుడి వీధిలోని కోదండరామస్వామి ఆలయంలో గరుడ సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారు గరుడవాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. చైర్మన్ వెంకటేష్ గుప్త, ఈఓ సుబ్రమణ్యం నాయుడు పాల్గొన్నారు

ఇళ్ల స్థలాల కోసం వినతి

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ పరిధిలో అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలంటూ ఆ గ్రామస్తులు మంగళవారం ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. పూతలపట్టులో గడప గడపకు కార్యక్రమంలో గ్రామస్తులు ఎమ్మెల్యేని కలిసి ఇళ్ల స్థలాల సమస్యను తెలియజేశారు. సురేంద్ర మాట్లాడుతూ తగ్గువారిపల్లె పంచాయతీ పరిధిలో ఇళ్ల స్థలాలు లేనివారి కోసం వజ్రాలపురం సమీపంలో జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు మంజూరు చేశారన్నారు. కాలనీలో జంబువారిపల్లెకు చెందిన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో తగ్గువారిపల్లె పంచాయతీలో ఇంకా అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు కాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇళ్ల స్థలాల కోసం భూమి కొనుగోలు చేసి ఇవ్వాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బీఎల్‌ఓలు బాధ్యతగా పనిచేయాలి



మాట్లాడుతున్న పర్వీన్

తవణంపల్లె: బీఎల్‌ఓలు ఓటర్ల సర్వే కార్యక్రమాన్ని బాధ్యతగా, పారదర్శకంగా చేపట్టాలని పూతలపట్టు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పర్వీన్ తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని రాజకీయ పార్టీల నేతలు, బీఎల్‌ఓలతో వేర్వేరుగా ఓటర్ల సర్వేపై సమావేశం నిర్వహించారు. పర్వీన్ మాట్లాడుతూ మండలంలో ఓటర్ల సర్వేను ఈనెల 21 తేదీలోపు పూర్తి చేసి నివేదిక పంపాలని ఆదేశించారు. తహసీల్దార్ గుణశేఖర్‌రెడ్డి, డీటీ నరేష్‌కుమార్, భూ రీసర్వే డీటీ వెంకటరమణ పాల్గొన్నారు.

ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కోవాలి



పోలీసులకు సూచనలిస్తున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

చిత్తూరు అర్బన్: విధి నిర్వహణలో పోలీసులు ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని చిత్తూరు ఆర్మ్‌డ్ రిజర్వు (ఏఆర్) ఏఎస్పీ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం చిత్తూరులోని ఏఆర్ పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీసులకు మాక్‌డ్రిల్ నిర్వహించారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో ఎక్కడా వెనుకడుగు వెయ్యొద్దన్నారు. ప్రముఖులు, పబ్లిక్ మీటింగులకు బందోబస్తు విధులకు హాజరైనపుడు ఉన్నతాధికారుల ఆదేశాలు కచ్చితంగా పాటించాలన్నారు. అసాంఘిక శక్తుల ప్రమేయాన్ని ముందే పసిగట్టి నేరం జరగకుండా నియంత్రించే చొరవ కూడా చూపాలన్నారు. ఎన్నికల విధులను సైతం సమర్థవంతంగా నిర్వర్తించడానికి మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందికి మాక్‌డ్రిల్ నిర్వహించారు. చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, సీఐలు విశ్వనాథరెడ్డి, మద్దయ్య ఆచారి, ఆర్‌ఐలు నీలకంఠేశ్వరరెడ్డి, మధు పాల్గొన్నారు.

వీధి దీపాలు, రోడ్ల పరిశీలన



రోడ్లు, లైట్లు పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరంలో వీధి దీపాల నిర్వహణపై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జె.అరుణ మంగళవారం రాత్రి పలు ప్రాంతాలను పర్యవేక్షించారు. ద్విచక్రవాహనంలో కూర్చుని ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నగరంలోని వన్నియర్‌బ్లాక్, గాంధీ రోడ్డు, జెండామానువీధి ప్రాంతాలను పరిశీలించారు. పలుచోట్ల వీధి దీపాలను మార్చాలని అధికారులకు సూచించారు. అలాగే పలు ప్రాంతాల్లో ఇష్టానుసారంగా వెలసిన స్పీడ్‌బ్రేకర్లను సైతం కమిషనర్ గుర్తించారు. ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్ల ఇళ్ల ముందు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసుకోవడంపై కమిషనర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అనవసరంగా ఏర్పాటు చేసిన వాటిని తొలగించాలని ఆదేశించారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజినీర్ వెంకటప్రసాద్, కార్పొరేటర్ శశికుమార్, ఏఈలు శ్రీలత, లోకేష్, సిబ్బంది శివకుమార్ ఉన్నారు.

నాడు–నేడు పనులు వేగవంతం

ఐరాల: మనబడి నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని ఎంఈఓలు రుషేంద్రబాబు, దామోదర్ నాయుడు ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు–నేడు రెండో విడత పనులను గడువులోపు పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వ నిర్దేశ మార్గదర్శకాలను అనుసరించి పనులను చేపట్టాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. విద్యార్థులు డ్రాప్ అవుట్ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా డ్రాప్ అవుట్ అయి ఉంటే వివరాలు మా దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే చంటిపిల్లలకు ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రవిరాజు



గుడిపాలలో మాట్లాడుతున్న స్వర్ణలత

- డీఐఓ డాక్టర్ రవిరాజు

యాదమరి: తల్లిపాలతోనే చంటి పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని చిత్తూరు ప్రభుత్వాస్పత్రి డీఐఓ డాక్టర్ రవిరాజు కోరారు. మంగళవారం మండలంలోని సంతగేటు ప్రభుత్వాస్పత్రిలో వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ అధ్యక్షతన ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాలపై చంటి బిడ్డల తల్లులతో మాట్లాడాలని సూచించారు. గ్రామాల్లో ప్రతి గడపకూ వెళ్లి వంద శాతం వ్యాక్సినేషన్ కార్యక్రమం చేయాలని సూచించారు. సీహెచ్‌ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతం లాంటివి

గుడిపాల: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని గుడిపాల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత అన్నారు. గుడిపాలలోని నారగల్లు క్లస్టర్‌లో మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పుట్టిన అరగంటలోపు బిడ్డకు తల్లిపాలు తాగించాలన్నారు. తల్లిపాలల్లో ఉండే పోషకాలపై అవగాహన కల్పించేందుకు తల్లిపాల వారోత్సవాలు అని చెప్పారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రావణి, జయంతి, కస్తూరి పాల్గొన్నారు.